సాక్షి
తిరుపతి
శనివారం । 12 । ఏప్రిల్ । 2025



నిర్లక్ష్యపు గుంత.. అభివృద్ధికి గంత

శ్రీకాళహస్తి ఆర్‌అండ్‌బీ డివిజన్ పరిధిలోని రోడ్లకు కూటమి గ్రహణం పట్టింది. బిల్లులు ఇవ్వక అభివృద్ధికి గండి పడింది. - 10లో



పూలే సేవలు చిరస్మరణీయం

మహాత్మజ్యోతీరావు పూలే సేవలు చిరస్మరణీయమని జేసీ శుభం బన్సల్ కొనియాడారు. - 10లో



పంటలపై అడవి పందుల దాడి

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని అటవీ శివారు గ్రామాల్లో పంటలపై అడవి పందులు దాడులు చేసి, ధ్వంసం చేస్తున్నాయి. - 10లో

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ఈడీ చెన్నయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి మే 10 వరకు ఆన్‌లైన్‌లో ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో పరిశ్రమల సేవా వ్యాపారం, రవాణా రంగం, వ్యవసాయ రంగాలకు సంబంధించి 1,267 యూనిట్లు మంజూరు చేశామన్నారు. యూనిట్ ఆధారంగా రాయితీలున్నాయని తెలిపారు. తిరుపతి జిల్లాలో మంజూరు చేసిన 1,267 యూనిట్ల విలువ రూ.5289.90 లక్షలుగా పేర్కొన్నారు. అందులో రాయితీ రూ.2088.64 లక్షలు వెల్లడించారు. బ్యాంక్ రుణం రూ.2936.77 లక్షలని చెప్పారు. లబ్ధిదారు వాటాగా రూ.264.50లక్షలు ఉంటుందని స్పష్టం చేశారు. మండల, మున్సిపల్, జిల్లా స్థా యి కమిటీల ఆధ్వర్యంలో నిబంధనల ప్రకారం లక్ష్యం మేరకు పారదర్శకంగా రుణాల ఎంపిక చేస్తామని చెప్పారు. బ్యాంక్ ఎండీల నేతృత్వంలో సబ్సిడీలు ఉంటాయని చెప్పారు. దరఖాస్తు చేసుకోవడానికి 21-50 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలని తెలిపారు. తెల్లరేషన్ కార్డులు, కులధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత ఆధారం ఎంపిక జరుగుతుందని తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు, కుల ధ్రువ పత్రం, విద్యార్హతలు కలిగి ఉండాలని తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మీసేవా లేదా ఇంటర్నెట్ కేంద్రాల్లో చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలో నియమాకాలు చేపట్టారు. చిత్తూరు జిల్లాకు చెందిన పలువురికి రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో పలు హోదాల్లో చోటు కల్పించారు. శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం వివరాలను ప్రకటించింది. రాష్ట్ర విద్యార్థి విభాగంలో ఉపాధ్యక్షుడిగా ఓబుల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యుగంధర్, కార్యదర్శిగా నరేష్, సంయుక్త కార్యదర్శిగా కలయన్ భరత్, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగంలో ప్రధాన కార్యదర్శులుగా ఉపేంద్రరెడ్డి, పదార్థి రాధకృష్ణారెడ్డి, కార్యదర్శిగా అనిల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం ఉపాధ్యక్షుడిగా అవిలా లోకనాథరెడ్డి, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ విభాగంలో కార్యదర్శిగా డాక్టర్.సైమన్ సీజర్ బండారు, సంయుక్త కార్యదర్శిగా సురేంద్రకుమార్‌ను నియమించారు.



జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిత్తూరులో నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

కదం తొక్కిన పాత్రికేయలోకం

అక్షర స్వేచ్ఛ హరణ.. భావవ్యక్తీకరణకు బంధనం.. జర్నలిస్టులపై అక్రమ కేసులు.. వారి గొంతు నొక్కాలన్న యత్నం.. బెదిరింపు ధోరణలకు నిరసనగా పాత్రికేయలోకం శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా కదం తొక్కింది. ర్యాలీలు.. నిరసనలు.. ఆందోళనలు చేపట్టింది. అక్షర స్వేచ్ఛ కల్పించాలని, కేసులు ఉపసంహరించుకోవాలని ఉన్నతాధికారులకు పాత్రికేయులు వినతి పత్రాలు అందజేశారు.

సాక్షిపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్

- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- చిత్తూరు ఆర్డీఓకు వినతిపత్రం అందజేత
- ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన.. సీఐకి వినతి

చిత్తూరు అర్బన్: పాత్రికేయులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, జర్నలిస్టులను అణగదొక్కాలని చూస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ చిత్తూరులో పాత్రికేయలోకం కదం తొక్కింది. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, చిత్తూరు ప్రెస్ క్లబ్, వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, గంగాధర నెల్లూరు నియోజకవర్గ ప్రెస్‌క్లబ్, తవణంపల్లె ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం చిత్తూరు నగరంలో విలేకరులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లోకనాథన్, మురళీకృష్ణ, చిత్తూరు ప్రెస్ క్లబ్ కార్యదర్శి కాలేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వన్‌టౌన్ స్టేషన్ నుంచి గాంధీ విగ్రహం, ఆర్డీఓ కార్యాలయం వరకు వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు లోకనాథన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల గొంతుపై కేసులు పెట్టి పాత్రికేయులను లోబరచుకోవాలని చూస్తోందన్నారు. పల్నాడులో వైఎస్సార్ సీపీ కార్యకర్త హత్యకు గురైన వార్తలు రాసినందుకు ఆరుగురు పాత్రికేయులతోపాటు, సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపై క్రిమినల్ కేసులు పెట్టడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. పత్రికలో ప్రచురితమైన వార్తలో అభ్యంతరం ఉంటే ఖండించడం, న్యాయపరంగా ముందుకు వెళ్లడం చేయాలే తప్ప, ఎవరో ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ రాజ్యాంగం కల్పించిన భావవ్యక్తీకరణ ప్రకటనను హరించడమేనన్నారు. రాష్ట్ర డీజీపీ సైతం కనీస న్యాయ సలహా తీసుకోకుండా పాత్రికేయులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించడం మంచిది కాదన్నారు. ఈ నిరసన కార్యక్రమం అనంతరం చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులను కలిసి సాక్షి పాత్రికేయులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అశోక్ కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జయప్రకాష్, ఉపాధ్యక్షులు శివకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్, వెంకటేష్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు పవన్, శివకుమార్, కార్యవర్గ సభ్యులు చంద్ర, రాజేష్, బాలసుందరం, గంగాధర నెల్లూరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తిరుమలయ్య, నరేష్, తేజ, ఎంజీఆర్, తవణంపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జగన్నాథం, శివకుమార్, అనంత్ కుమార్, పాత్రికేయులు హేమంత్ కుమార్, ప్రవీణ్, జయకుమార్, ఐరాల చిన్న, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో..

ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట పాత్రికేయులు నిరసన వ్యక్తం చేసి, వన్‌టౌన్ సీఐ మహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకులు జయరాజ్, ప్రకాష్ మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను హరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డితోపాటు మరో ఆరుగురు పాత్రికేయులపై కేసులు పెట్టిందన్నారు. ప్రభుత్వం కేసులు పెట్టి పాత్రికేయులను బెదిరింపులకు గురిచేస్తోందన్నారు. పోలీసులు ఉద్దేశపూర్వకంగా క్రిమినల్ కేసులు పెట్టారని, ఇలాంటి చర్యలను ఉపేక్షించేదిలేదన్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతమైతే జర్నలిస్టులు జిల్లాల వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఈ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఫెడరేషన్ పాత్రికేయ సంఘ నాయకులు బాలసుబ్రమణ్యం, మురళీ, కృపానందరెడ్డి, కేశవులు, నీరజాక్షులు, జయచంద్ర, వరదరాజులు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛ హరించడం సబబుకాదు

- పలమనేరు ఆర్డీఓకు వినతిపత్రం అందజేత

పలమనేరు: పత్రికా స్వేచ్ఛను ప్రభుత్వాలు హరించడం సబబుకాదని, పత్రికలను అణగదొక్కాలని గతంలో అనుకున్న పార్టీలు ఆపై కనిపించకుండా పోయాయని పలమనేరు వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్, దిలీప్ అన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై కేసు నమోదుకు వ్యతిరేకంగా స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో కలసి శుక్రవారం నిరసన తెలిపి ఆపై స్థానిక ఆర్డీఓ భవానీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికల్లో వెలువడే వార్తలను పార్టీలకు అంటగడుతూ ఎడిటర్లపై కేసులు నమోదు చేయడం కరెక్ట్ కాదన్నారు. గతంలో ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ జరగలేదన్నారు. పత్రికలో వచ్చిన వార్త తప్పుగా ఇంటే దానిపై ఖండన, రీజాయిండర్ ఇవ్వాలి గానీ, ఇలా కేసులు పెట్టడం, దాన్ని పోలీసులు అమలు చేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాసామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాపై కేసులు పెట్టడం భవిష్యత్తులో అనర్థాలకు దారితీయడం ఖాయంగా కనిపిస్తోందన్నారు. ఇలాంటి తప్పుడు కేసులపై ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఇలాంటి సంస్కృతి కొనసాగితే రేపు మరోపార్టీ అధికారంలోకి వచ్చాక ఇలాంటివి పునరావృత్తం కావడం ఖాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. ఇందులో ప్రెస్‌క్లబ్ సభ్యులు రెడ్డెప్ప, సుబ్రమణ్యం, రంజిత్, సూర్యబాబు, సాక్షి మణి, మోహన్‌మురళి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పలమనేరు ఆర్డీఓ భవానీకి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

అభివృద్ధి బాటకి.. అవినీతి మరకలా?



టీడీఆర్ బాండ్లలో కానరాని అవినీతి

- గత పాలకులపై నిందలేయడమే కూటమి లక్ష్యం
- కుంటి సాకులు చూపుతూ బాండ్ల జారీలో ఆలస్యం
- తూతూమంత్రంగా స్పెషల్ డ్రైవ్

తిరుపతి తుడా: నగర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వ హయాంలో రహదారుల అభివృద్ధిని పట్టాలెక్కించారు. నాటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డితోపాటు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదంతో తిరుపతి తలరాతను మార్చే 21 మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధిని నాటి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తన భుజస్కంధాలపై వేసుకున్నారు. తిరుపతి విస్తరణ, రోడ్ల కనెక్టివిటీ, ఒత్తిడి తగ్గించడమే లక్ష్యంగా మరో 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. 2018 తుడా మాస్టర్ ప్లాన్ ఆధారంగా రహదారుల నిర్మాణాన్ని పరుగులు పెట్టించారు. రాజకీయంగా తమకు కొంత నష్టం జరుగుతుందని భావించినా వెనుకడుగు వేయలేదు.

442 మందికి టీడీఆర్ బాండ్లు

21 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంలో మొత్తం 1,303 మందికి సంబంధించిన స్థలాలు ప్రభావం చూపుతాయని తేల్చారు. ఇందులో 997 మంది టీడీఆర్ బాండ్లు పొందడానికి అర్హులుగా గుర్తించారు. మరో 809 మంది స్థల యజమానులకు సంబంధించి నోటీసులు జారీ చేశారు. ఇందులో మొత్తంగా 442 మందికి టీడీఆర్ బాండ్లను అందజేశారు. ఈ తంతు జరుగుతున్న క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో టీడీఆర్ బాండ్ల జారీ ఆగిపోయింది.

పసలేని ఆరోపణలు

టీడీఆర్ బాండ్లలో అవినీతి జరిగిపోయిందంటూ నాటి ప్రతిపక్ష టీడీపీ, ఆ పార్టీకి అనుబంధంగా పని చేస్తున్న ఎల్లో మీడియా నానాయాగి చేశాయి. వందల కోట్లు అవినీతి జరిగిందని అపద్ధాన్ని పదేపదే చెప్పి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశాయి. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు నాటి పాలకులపై అబాండాలు వేశారు. ఆరు నెలల పాటు పచ్చి అపద్ధాలను భుజాన వేసుకుని రచ్చ చేశారు. ఏకంగా రూ.2,500 కోట్ల అవినీతి అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీఆర్ బాండ్ల వ్యవహారంలో కమిటీ వేసి నిగ్గు తేల్చాలని ప్రయత్నించి విఫలమయ్యారు.

పక్కాగా భూసేకరణ

21 మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి కోసం అధికారుల ద్వారా స్పష్టమైన ప్రణాళికలు రచించారు. ము న్సిపల్ కార్పొరేషన్, తుడా, రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్ల సమీక్షలతో ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాస్టర్ ప్లాన్ రోడ్లకు భూములు, స్థలాలు ఇచ్చిన యజమానులకు నష్ట పరిహారం కింద టీడీఆర్(ట్రాన్స్ ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్లు ఇవ్వాలని నిర్ణయించారు. అనంతరం ఆ స్థలాన్ని మున్సిపల్ కా ర్పొరేషన్‌కు గిఫ్ట్ డీడ్ ద్వారా బదిలీ చేయించారు. ఆపై యజమాని పేరిట టీడీఆర్ బాండ్లను జారీచేశారు.

నాన్ కమర్షియల్ అంటూ రాద్ధాంతం

ఒక వ్యక్తి తన స్థలంలో వెయ్యి చదరపు మీటర్లు (1196 చ.గజాలు) కోల్పోతే ఆ వ్యక్తికి 4 వేల చ.మీటర్ల (మూడింతలు పెంచి) విలువగల టీడీఆర్ బాండ్లను జారీ చేస్తారు. అప్పుడు ఆ టీడీఆర్ బాండ్ విలువ 4000 ఇంటూ 37,000 = 14,80,00,000 రూపాయల విలువకు చేరుతుంది. కానీ ఆ బాండ్లను ఆ స్థల యజమాని విలువలో 40 శాతంలోపు మాత్రమే అమ్మగలరు. అందులోనూ 10 శాతం ఆదాయపు పన్ను రూపంలో కట్టాల్సి ఉంటుంది. చివరికి అతను పొందే సొమ్ము 30 శాతం మాత్రమే ఉంటుంది. ఇలా ప్రతి బాండు విలువ 40 శాతం లోపే అమ్ముకుంటారు. ఈ విషయాలను పక్కకు నెట్టి నిందారోపణలు చేశారు.

నగరాభివృద్ధే లక్ష్యం

నగరాభివృద్ధే లక్ష్యంగా తొలిసారిగా డీబీఆర్ రోడ్డు (డాక్టర్ వైఎస్సార్ మార్గ్), గెస్ట్‌లైన్ డేస్ రోడ్డు (అన్నమయ్య మార్గ్) వేగంగా అభివృద్ధి చేశారు. ఈ రోడ్లు అందుబాటులోకి రావడంతో తక్కువ వ్యవధిలోనే నగరంలోని తూర్పు ప్రాంతం అభివృద్ధిలోకి వచ్చింది. ఇంకా కనెక్టవిటీ పెరగాలన్న ఉద్దేశంతో ఏడాది కాలంలో 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేశారు. రోడ్ల అభివృద్ధి చేసిన ప్రాంతాల్లో స్థానిక స్థిరాస్తుల విలువ ఐదురెట్లు పెరిగింది. మున్సిపల్ కార్పొరేషన్‌కు ఏడాదిలో సుమారు రూ.18 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది.

గరిష్ట విలువ ఆధారంగానే!

కమర్షియల్ విలువ ఆధారంగా టీడీఆర్ బాండ్లను పట్టణ ప్రాంతాల్లో నాలుగు రెట్ల విలువతో సమానంగా బాధితులకు అందించారు. స్థలం కోల్పోయిన యజమానులకు నిబంధనలు, 2013 యాక్ట్ ప్రకారం బాండ్లను అందజేశారు. ఆ విషయాలను తొక్కిపెట్టి అపోహలు రగిలించేందుకు ప్రయత్నించారు.

కమర్షియల్ ప్రాంతాలను ఆధారం చేసుకునే!

హీరో హోండా షోరూం-పద్మావతీపురం మాస్టర్ ప్లాన్ రోడ్డులో స్థలం కోల్పోయిన యజమానులకు హీరో హోండా భవనం కమర్షియల్ ఆధారంగా, అనంత ఆళ్వార్ మార్గ్ అభివృద్ధిలో స్థలాలు కోల్పోయిన యజమానులకు అంకుర ఆస్పత్రి ఆధారం చేసుకుని కమర్షియల్ ప్రాతిపాదికన గరిష్ట విలువను పరిగణనలోకి తీసుకుని టీడీఆర్ బాండ్లను అందించారు. ఇలా 21 మాస్టర్ ప్లాన్ రోడ్లలోనూ సమీపంలోని కమర్షియల్ ప్రాంతాలను పరిగణలోకి తీసుకుని స్థలం కోల్పోయిన యజమానులకు న్యాయం చేశారు.

గత ప్రభుత్వంపై నిందలు

టీడీఆర్ బాండ్లను సకాలంలో ఇవ్వకుండా అధికారులు జాప్యం చేస్తున్నారు. ఈ ఆలస్యంపై యజమానుల్లో వ్యతిరేకత రావడంలో ఇటీవల టీడీఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. కావాలనే కాలయాపన చేస్తూ గత ప్రభుత్వంపై నిందలు మోపడమే పనిగా పెట్టుకున్నారు. గ్రూప్ థియేటర్స్ రోడ్డు బాధితులకు టీడీఆర్ బాండ్లు ఇచ్చిన సమయంలో ఖాదీ కాలనీ మెయిన్ రోడ్డు బాధితులకు ఇవ్వడంలో జాప్యం ఎందుకో అధికారులే చెప్పాలి. టీడీఆర్ బాండ్ల జారీ వల్ల బాధితులకు మినహా మిగిలిన ఏ వ్యక్తికీ ఆర్థిక ప్రయోజం ఉండదని ఇప్పుడు గుర్తించారు. నాడు చేసిన ఆరోపణలు అవాస్తవాలేనని నాలుక కొరుక్కుంటున్నారు. ఈ క్రమంలోనే టీడీఆర్ బాండ్ల జారీలో జాప్యం చేస్తున్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

తిరుపతి సిటీ: అణగారిన వార్గాల ఆశాజ్యోతి, స్త్రీ విద్య కోసం ఎనలేని కృషి చేసిన మహనీయులు మహాత్మా జ్యోతిబా పూలే అని వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. శుక్రవారం తిరుపతి వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో పూలే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కుల వివక్ష నిర్మూలన, సమసమాజ స్థాపన కోసం అవిశ్రాంత పోరాటం చేసిన సాంఘిక సంస్కర్త పూలే అన్నారు. నేటి యువత ఆయన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయ కర్త అభినయ్‌రెడ్డి, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, బీసీ నాయకులు లవ్‌లీ వెంకటేష్, మోహన్, అరుణ్, మురళి, బొగ్గుల వెంకటేష్, కరాటే శీను, గోపాల్‌రెడ్డి, రమణ, సాయికుమారి, పునీత, పుష్పలత, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, పార్టీ నాయకులు

మూగజీవి మృత్యుఘోష



చర్మవ్యాధితో బాధపడుతున్న ఆవు దూడ



మృత్యువాత పడిన కోడె దూడ



చనిపోయిన లేగదూడ



ఆవుదూడ కళేబరం



మృతిచెందిన ఆవు

తెలుగు సంస్కృతిలో అమ్మ తరువాత ఆరాధ్య దైవం ఆవు. అంతటి ప్రాధాన్యం ఉండడంతోనే గోమాతను పూజిస్తాం.. ఆరాధిస్తాం. ఆ ఆలమందలంటే కలియుగ వైకుంఠ వాసుడికీ ఎంతో ప్రీతిపాత్రం. అందుకే ఆయన చెంత గోశాల నడుస్తోంది. ఆ గోవులనూ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కాటేస్తోంది. టీటీడీ గోశాలలో ఆవులకు సరైన ఆహారం.. సంరక్షణ కరువై మృత్యువాత పడుతున్నాయి. మూగజీవి మృత్యుఘోష పెడుతోంది. అయినా టీటీడీతోపాటు కూటమి సర్కారు మాటరాని మౌనమిదీ అన్న చందంగా వ్యవహరిస్తోంది. - తిరుపతి సిటీ



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.96,370
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,701
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.95,400
రిటైల్ వెండి గ్రాము	రూ.98.40

క్లుప్తంగా

పంటలపై అడవి పందుల దాడి


అడవి పందులు ధ్వంసం చేసిన వేరుశనగ

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కాంపాశైలం, కరకంబట్టు, కుక్కంబాకం, బుచ్చినాయుడుకండ్రిగ, గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలపై అడవిపందులు దాడులు చేసి ధ్వంసం చేస్తున్నాయి. అటవీ సరిహద్దు గ్రామాల్లో 565 ఎకరాల భూములున్నాయి. ఈ భూముల్లో అడవి పందులు రాత్రి వేళల్లో పంటలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంటలు చేతికి వచ్చే సమయంలో పందులు నాశనం చేయటంతో రైతులు దిక్కుతోచక నానా అవస్థలు పడుతున్నారు.

కిలాడీ లేడీది కలువాయి మండలమే!


రజిత

కలువాయి(సైదాపురం): ఉద్యోగం కావాలనా నాయనా... అయితే ఎస్బీఐలోనే ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.లక్షల్లో నగదు తీసుకుని ఒక పోలీసు అధికారి సహకారంతో నెల్లూరు, బెంగళూరు, హైదరాబాద్‌లో దందా సాగిస్తున్న ఓ కిలాడీ లేడీది శ్రీపొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లా, కలువాయి మండలంలోని చౌటపల్లిగా పోలీసులు నిర్ధారించారు. వివరాల్లోకి వెళితే.. శ్రీపొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లా, కలువాయి మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన బత్తుల రజిత (రమ్య) మాదాపూర్ స్టేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నట్లు అందరినీ నమ్మించింది. స్నేహితుల సహకారంతో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మబలికేది. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టేందుకు నెల్లూరులోని ముత్తూట్ ఫైనాన్స్‌కు వెళ్లింది. అక్కడ ఉద్యోగం చేస్తున్న శ్రీదేవి అనే మహిళతో పరిచయం పెంచుకుని, నీకు ఎస్బీఐలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మబలికి ఆమె నుంచి తన తండ్రి వెంకటేశ్వర్లు ఖాతాల్లోకి పలు దఫాలుగా రూ.9.6 లక్షల నగదును వేయించుకుంది. అయితే కొన్ని రోజులు గడిచిన తర్వాత 2022లో నకిలీ ఎస్బీఐ అపాయింట్‌మెంట్ లెటర్‌ను, నకిలీ ఐడీ కార్డును ఇచ్చి హైదరాబాద్‌లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని మాయమాటలు చెప్పింది. అయితే నెలలు గడుస్తున్నా శ్రీదేవికి ఉద్యోగం రాకపోవడంతో గొడవ పడింది. దీంతో రజిత రూ.70 వేలు నగదును శ్రీదేవికి అందజేసింది. మిగిలిన నగదు ఇవ్వాలని అడగగా శ్రీదేవిపై దౌర్జన్యానికి దిగింది. దీంతో ఆమె నెల్లూరులోని వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో రజిత, ఆమె తండ్రి వెంకటేశ్వర్లుపై కేసు నమోదైంది.

కూటమి సర్కారు నిర్లక్ష్యపు గంత కట్టుకుంది. చేసిన పనులకు బిల్లులు ఇవ్వనంది. వెరసి.. అమ్మపెట్టక.. అడుక్కోనీయక చందంగా మారంది ఆ రహదారుల పరిస్థితి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు బిల్లులు రాలేదని పనులు చేయరు.. టెండర్లు జరిగాయని కొత్తవారు వాటి జోలికి వెళ్లరు.. దీంతో ఆ రోడ్లు అడుగుకో గుంత.. గజానికో గొయ్యి పడి అధ్వాన్నంగా మారాయి. ఫలితంగా ఆ రోడ్లలో ప్రయాణం నరకయాతనగా మారింది. అభివృద్ధికి గండి పడింది.


కదూరు-చిన్న పాండూరు మార్గంలో సుబ్బరాజుకండ్రిగ వద్ద అధ్వాన్నంగా ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డు

నిర్లక్ష్యపు గుంత.. అభివృద్ధికి గంత

- బిల్లులు మంజూరు చేయని కూటమి సర్కారు
- అర్ధంతరంగా ఆగిన ఆర్అండ్‌బీ రోడ్ల పనులు
- అధ్వానంగా ఆ మూడు రహదారులు

వరదయ్యపాళెం: శ్రీకాళహస్తి ఆర్అండ్‌బీ సబ్ డివిజన్ పరిధిలోని సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని కీలకమైన రోడ్ల అభివృద్ధికి అప్పటి ప్రభుత్వం నాబార్డు నిధులు రూ. 12 కోట్లు మంజూరు చేసింది. దీంతో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేశారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు సైతం ప్రారంభించారు. అయితే కొంత మేరకు పనులు పూర్తి చేశారు. ఇంతలో ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారింది. రోడ్ల పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు బిల్లుల కోసం దరఖాస్తు చేయగా కూటమి సర్కారు బిల్లులు ఇవ్వలేదు. దీంతో సంబంధిత పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్లు రోడ్ల పనులను అర్ధాంతరంగా ఆపివేశారు. దీంతో ఆ రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. ఇప్పటికే పనులు మంజూరు కావడం, టెండర్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో కనీసం సంబంధిత రోడ్లకు మరమ్మతులు కూడా చేపట్టలేని పరిస్థితి నెలకొంది.

ఆ మూడు రోడ్లకు కూటమి గ్రహణం వీడేనా?

సత్యవేడు నియోజకవర్గంలోని కదూరు కూడలి-చిన్న పాండూరు రోడ్డు పనులకు రూ.4.30 కోట్లు, శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఆర్బీకే (రేణిగుంట, పాపానాయుడుపేట, శ్రీకాళహస్తి) రోడ్డు నిర్మాణానికి రూ. 6.20 కోట్లు, శ్రీకాళహస్తి నుంచి కాసరం మీదుగా గొల్లగుంట రోడ్డుకు రూ.1.50 కోట్ల నాబార్డ్ నిధులు గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులకు సంబంధించి ఆర్ అండ్ బీ శాఖ ఆన్‌లైన్ టెండర్ పిలవడంతో కాంట్రాక్టర్లు దరఖాస్తు చేసుకుని టెండర్లు చేజిక్కించుకున్నారు. దీంతో 2024 జనవరి ప్రారంభంలో పనులు సైతం ప్రారంభించారు. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బిల్లుల కోసం దరఖాస్తు చేసుకోగా ఆలస్యమైంది. ఎన్నికల అనంతరం చేసిన పనులకు సంబంధించి కూటమి ప్రభుత్వానికి నివేదించగా ఆలస్యం చేస్తుండడంతో కాంట్రాక్టర్లు పనుల జోలికి వెళ్లలేదు.

నాబార్డ్ ద్వారా ఆర్ అండ్ బీ రోడ్లకు మంజూరైన నిధులు

రోడ్డు పేరు	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)
కదూరు కూడలి-చిన్న పాండూరు	4.30
ఆర్బీకే (రేణిగుంట నుంచి పాపానాయుడుపేట	6.20
మీదుగా శ్రీకాళహస్తి -గొల్లగుంట	1.50

అధ్వానంగా ఆ రోడ్లు

కదూరు-చిన్న పాండూరు రోడ్డు అధ్వానంగా మారింది. ఎక్కడ పడితే అక్కడ గుంతలు పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అలాగే శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి, గొల్లగుంట, రేణిగుంట నుంచి పాపానాయుడుపేట మీదుగా శ్రీకాళహస్తి రోడ్డు సైతం పూర్తిగా ధ్వంసమై వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో ఆ ప్రాంత ప్రజల నుంచే కాకుండా వాహనచోదకులు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. అభివృద్ధి పనుల్లో సైతం ఇలాంటి వివక్ష చూపడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏ ప్రభుత్వంలో మంజూరైన జరగాల్సిన పనులు యథావిధి జరిపించాలని, అందుకు కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని కోరుతున్నారు.


మట్టి రోడ్డును తలపిస్తున్న సత్యవేడు ప్రధాన ఆర్ అండ్ బీ రోడ్డు



కదిలింది స్వర్ణరథం.. మది మెదిలింది సర్వాంతర్యామి రూపం.. భక్తజనుల పెదవులు కీర్తించాయి కలియుగ వైకుంఠవాసుడి స్వర్ణకీర్తిని.. అర్పించాయి కరతాళ వందనం. నేత్రాలు స్వామి దివ్యరూపం చూసి తరించాయి. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సర్వాంతర్యామి.. శ్రీవేంకటేశ్వరస్వామి శుక్రవారం స్వర్ణరథంపై విహరించారు. – తిరుమల



కోదండరామస్వామివారి తెప్పోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారు తెప్పపై విహరించారు. ఉదయం తోమాల సేవ, సహస్రనామార్చన, స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం సీతారామలక్ష్మణులు ఆలయం నుంచి ఊరేగింపుగా శ్రీరామచంద్ర పుష్కరిణికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేకంగా విద్యుద్దీపాలతో అలంకరించిన తెప్పపై ఆశీనులై పుష్కరిణిలో ఏడు చుట్లు విహరించి భక్తులు కనువిందు చేశారు. – తిరుపతి కల్చరల్

హెచ్‌ఎం ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితా విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : జోన్-4 పరిధిలోని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ కేడర్ నుంచి హెచ్‌ఎం ఉద్యోగోన్నతులకు సీనియారిటీ జాబితా విడుదల చేసినట్లు వైఎస్సార్ కడప జిల్లా ఆర్జేడీ శామ్యూల్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్కూల్ అసిస్టెంట్ (గవర్నమెంట్ మేనేజ్‌మెంట్) నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులు (గవర్నమెంట్) కు ఉద్యోగోన్నతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాను ప్రచురించినట్లు తెలిపారు. సంబంధిత స్కూల్ అసిస్టెంట్‌ల జాబితా rjdsekadapa.blogspot.com లో పొందుపరిచినట్లు చెప్పారు. ఈ జాబితాను పరిశీలించుకుని ఏవైనా అభ్యంతరాలుంటే తగిన ఆధారాలతో చిత్తూరు డీఈఓ కార్యాలయంలో ఈనెల 16వ తేదీ లోపు అందజేయాలని ఆర్జేడీ వెల్లడించారు.

25 మందిపై కేసు నమోదు


అత్తివరంలో పరిశ్రమ వద్ద సెక్యూరిటీ గార్డ్‌ను విచారిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

ఓజిలి: మండలంలోని అత్తివరం గ్రామంలో పరిశ్రమల విషయంలో చోటు చేసుకున్న వివాదంలో రెండు వర్గాలకు చెందిన 25 మందిపై గురువారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు కథనం మేరకు.. అత్తివరం గ్రామంలోని పారిశ్రామిక సెజ్‌లో పరిశ్రమలున్నాయి. ఈ పరిశ్రమలలో అధిపత్యం కోసం టీడీపీ నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి ఘర్షణలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో గురువారం పరిశ్రమలకు వాటర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తుండగా పాల్చూరు అమరేంద్ర, ధర్మేంద్ర, పాకనాటి శ్రీనివాసులు మరో 10 మంది కలసి తనపై దాడి చేసి కులంపేరుతో దూషించారని బాధితుడు కుంపటి మహేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామంలో విచారణ జరిపి, 13 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేశారు. అలాగే పరిశ్రమలలో అధిపత్యం కోసం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో చెలరేగిన వివాదంలో ఎల్లు గురుమూర్తి, మహేంద్ర, అనీల్‌రెడ్డితోపాటు మరో 9 మంది తనపై దాడి చేశారని పాకనాటి లోకేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు 12 మందిపై ఎస్ఐ స్వప్న కేసు నమోదు చేశారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును శుక్రవారం నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు విచారణ చేపట్టారు. అత్తివరం గ్రామంలోని పరిశ్రమలు, గ్రామస్తులను విచారణ జరిపి వివరాలు సేకరించారు. ఈ మేరకు రెండు వర్గాలు మధ్య వివాదాలు చోటుచేసుకోకుండా గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు యథావిధిగా రిజిస్ట్రేషన్ సేవలు

తిరుపతి అర్బన్: ఆస్తుల క్రయవిక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్‌శాఖలో శనివారం యథావిధిగా రిజిస్ట్రేషన్ సేవలు కొనసాగుతాయని జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాధారణంగా రెండో శనివారం ప్రభుత్వ సెలవు అయినప్పటికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆస్తులకు సంబంధించి అన్ని రిజిస్ట్రేషన్లు చేస్తామని పేర్కొన్నారు. ఈ అంశాన్ని క్రయ విక్రయ దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో 17 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు రెండో శనివారం పనిచేస్తాయన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం

- కలెక్టరేట్‌లో పూలే జయంతి వేడుకలు..


బీసీ రుణాలపై మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: మహిళల విద్యకు మహాత్మా జ్యోతి బాపూలే చేసిన సేవలు చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీలకు విద్య అవసరమన్న విషయం గుర్తించి, ఆ దిశగా ఎనలేని సేవలు చేసిన మహా మనిషి జ్యోతిబాపూలే అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ రోజు ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమం అధికారికంగా నిర్వహించామన్నారు. దేశ చరిత్రలో సామాజిక సంస్కరణలకు జ్యోతిబా పూలే ఆద్యుడని తెలిపారు. అనంతరం కార్పొరేషన్ రుణాలకు చెందిన చెక్కును జారీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 600 మంది బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు పలు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహాయాదవ్, డీఆర్వో నరసింహులు, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈఓ బాబు రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం, రజక వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు మదన్‌మోహన్, చంద్రన్న, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాలాజీ కాలనీలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మాంగాటి గోపాల్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకట నరసింహులు, నేతలు యార్లపల్లి గోపి, అశోక్ సామ్రాట్ యాదవ్, మజీద్ పటేల్, శివశంకర్ పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో ఏడు పరిశోధనలకు ఆమోదం


అధ్యాపకులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: అంతర్జాతీయ విద్యా పరిశోధన నిధి ద్వారా ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్(పీఎం ఉష) పథకం కింద ఏడు అంతర్జాతీయ విద్యా పరిశోధన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ తెలిపారు. ఇందులో ప్రధానంగా యూఎస్ఏ జెనోమిక్స్ బయోటెక్ ఇంక్ వర్సిటీ, మలేషియాలోని టెరెంగాను, యూనివర్సిటీ అటున్ హుస్సేన్ ఓన్, అలాగే యూఎస్‌లోని టెక్సాస్ ఫోర్ట్ వర్త్ వర్సిటీ, కెనడాలోని యార్క్ విశ్వవిద్యాలయం, నేపాల్‌లోని ఖాట్మండు విశ్వవిద్యాలయం భాగస్వామ్యంతో బయోటెక్నాలజీ, అప్లైడ్ మైక్రోబయాలజీ, హోమ్ సైన్స్, ఫార్మసీ, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, లా విభాగాల్లో పరిశోధన ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. ఈ నిధులను మ్యాచింగ్ గ్రాంట్ కింద అధ్యాపకులకు అందిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ప్రాజెక్టుల సాధనలో కృషి చేసిన ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్లను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజిని, డీన్ ప్రొఫెసర్ పి విజయలక్ష్మి, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ ఆర్ ఉషా పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 57,462 మంది స్వామివారిని దర్శించుకోగా 22,998 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.94 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

యూపీఎస్సీ కంబైన్డ్ డిఫెన్స్ పరీక్షలు రేపు


మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: నగరంలో ఆదివారం యూపీఎస్సీ కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నావల్ అకాడమీ ఎగ్జామినేషన్ పరీక్షలు జరగనున్నాయని, వీటికి నిర్వహనకు పటిష్ట చర్యలు చేపట్టాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో యూపీఎస్సీ పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. తిరుపతిలో 3 చోట్ల పరీక్షలు ఉంటాయన్నారు. యూపీఎస్సీ కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటలకు ఉంటాయని వెల్లడించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నావల్ అకాడమీ ఎగ్జామినేషన్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతాయన్నారు. జిలాల్లో 3 సెంటర్లు కేటాయించామన్నారు. 973 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని చెప్పారు. ఈ పరీక్షలకు డిప్యూటీ తహసీల్దార్ అధి కారి లైజన్ అధికారిగా ఉంటారన్నారు. పరీక్ష కేంద్రంలో మెరుగైన సౌకర్యాలను కల్పించాలని తెలిపారు. మొబైల్స్, ఎలక్ట్రికల్ వస్తువులకు అనుమతి లేదన్నారు. మరోవైపు బస్టాండ్ నుంచి ఆర్టీసీ వారు పరీక్ష కేంద్రాల వరకు ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేస్తున్నారన్నారు. తిరుపతిలోని బాలాజీ కాలనీ వెస్ట్ చర్చి రోడ్డు మార్గంలోని శ్రీపద్మావతి బాలికల ఉన్నత పాఠశాలతోపాటు శ్రీపద్మావతి అతిథి గృహం వద్ద శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల(వింగ్-ఏ), శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల (వింగ్-బీ)పరీక్ష కేంద్రాలుగా ఉన్నాయన్నారు. ఆర్డీఓ రామమోహన్, యూపీఎస్సీ డిప్యూటీ సెక్రటరీ ఎన్‌కే స్వామి పరీక్షలను పర్యవేక్షించనున్నారని చెప్పారు.

హంస వాహనంపై లక్ష్మీనరసింహుడు


తిరుమంజనం చేస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారు ఉభయనాంచారులతో కలసి హంస వాహనంపై విహరించారు. స్వామి వారి అలంకార మండపంలో నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవమూర్తులను కొలువు దీర్చి, కోన మాఢవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీవారి కల్యాణ మండపంలో నిత్యహోమం, 10 గంటలకు స్వామి వారి నందనవనంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి


మాట్లాడుతున్న సురేంద్ర నాయుడు

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీలో పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నివారించి, మెరుగైన సరఫరాకు కృషి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి ఎస్ఈ సురేంద్ర నాయుడు సూచించారు. ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఏపీఎస్పీడీసీఎల్) తిరుపతి సూపరింటెండింగ్ ఇంజనీర్ పి. సురేంద్ర నాయుడు శుక్రవారం శ్రీసిటీలో నిర్వహించిన పరిశ్రమల విద్యుత్ వినియోగదారుల సదస్సులో పాల్గొన్నారు. విద్యుత్ వినియోగం, సరఫరా, ఇతర విద్యుత్ సమస్యలపై పరిశ్రమల ప్రతినిధులతో చర్చించారు. పరిశ్రమ వర్గాలకు పలు సందేహాలను నివృత్తి చేశారు.

తుంబురు తీర్థానికి భారీగా భక్తులు

తిరుమల: తుంబురు తీర్థ ముక్కోటికి భారీగా విచ్చేసే భక్తుల సౌకర్యార్థం తితిదే విస్తృత ఏర్పాట్లు చేసింది. శుక్రవారం, శనివారం పాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా విశేష సంఖ్యలో భక్తులు శేషాచల అడవుల్లోని తుంబూరు తీర్థ ముక్కోటికి వస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 5 నుంచి 10 గంటల వరకు భక్తులను అనుమతించారు. తీర్థంలో భక్తులు పుణ్యస్నానాలు చేసి శ్రీ తుంబురుడిని దర్శించుకుని పూజలు చేశారు. శ్రీవారి సేవకుల ద్వారా భక్తులకు అన్నప్రసాదం, నీళ్ళు, మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులకు భద్రత, వైద్యసేవలను తితిదే విజిలెన్స్ అటవీశాఖ, వైద్యవిభాగం ఏర్పాటు చేశారు. భక్తులను శనివారం ఉదయం 5 నుంచి 10 గంటల వరకు మాత్రమే తుంబురు తీర్థంకు అనుమతిస్తారు తితిదే ఏర్పాట్లను వీజీఓ సురేంద్ర, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మధుసూదర్రావు, అన్నప్రసాదం ప్రత్యేకాధికారి జీఎల్ఎన్ శాస్త్రి తదితరులు పర్యవేక్షించారు.

విరూపాక్షపురంలో కుల దురహంకారం

- బండి నెమ్మదిగా నడపమన్నందుకు గిరిజనులపై అగ్రకులాల మూకుమ్మడి దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

శ్రీకాళహస్తి: ద్విచక్ర వాహనాన్ని నెమ్మదిగా నడమన్నందుకు అగ్ర కులాలు గిరిజనులపై మూకుమ్మడిగా దాడి చేసిన ఘటన తిరుపతి జిల్లా, తొట్టంబేడు మండలం, విరూపాక్షపురం గిరిజన కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత గిరిజనుల కథనం మేరకు.. గద్దగుంట గ్రామానికి చెందిన వన్నెకాపు సుబ్రమణ్యం కుమారుడు చైతన్య శ్రీకాళహస్తి నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో విరూపాక్షపురం ఎస్టీ కాలనీ వద్ద బండి వేగంగా నడపడంతో రోడ్డు దాటుతున్న ఓ చిన్నారిని ఢీకొనబోయాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న నాగయ్య, వెంకటేష్ బండి నెమ్మదిగా నడపొచ్చు కదా..? అంటూ చైతన్యను నిలదీశారు. దీంతో అహం దెబ్బతిన్న చైతన్య రోడ్డుపైనే నాగయ్య, వెంకటేష్‌పై దాడి చేశాడు. అక్కడితో ఆగకుండా గద్దగుంటకు వెళ్లి మరో 20 మందిని వెంట తీసుకొచ్చి ఇంకోసారి నాగయ్య, వెంకటేష్ లపై విచక్షణారహితంగా దాడి చేశాడు. అగ్రకులస్తుల దాడిలో తీవ్రంగా గాయపడిన నాగయ్య(60), వెంకటేష్(30)ను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై తొట్టంబేడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గిరిజనులపై అహంకారపూరితంగా దాడికి దిగిన అగ్రకులస్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య డిమాండ్ చేశారు.